సాక్షి చిత్తూరు

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభం

పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభించడం ఆనందంగా ఉందని కంపెనీ సీఈఓ సురేష్ కండెవాల్ తెలిపారు. - 8లో



రోడ్డు భద్రత పాటించాలి

మురకంబట్టులోని ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. - 8లో



సారా తయారీపై ఉక్కుపాదం

శ్రీరంగరాజపురం మండలంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు మంజూరు



మిథున్‌రెడ్డి, ఎంపీ

సదుం : మండలంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యటనలో వచ్చిన వినతులు పరిష్కరించేలా..అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేశారని పార్టీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. నాయినివారిపల్లె, శీలయ్యగారిపల్లె, తమటంవారిపల్లెలో రూ.7.2 లక్షలు , చీకలచేను, దిన్నెవడ్డిపల్లెలో రూ.4 లక్షలతో బోర్లు వేయనున్నట్లు పేర్కొన్నారు. రామాపురంలో రూ.3 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంటు, నీంపగట్టువారిపల్లెలో రూ. 5 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించనున్నట్లు తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు మొత్తం రూ. 19.20 లక్షలు విడుదల అయ్యాయని వివరించారు. సమస్యల పరిష్కారానికి ఎంపీ స్పందించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సప్తగిరి జోనల్ బ్రాంచ్ తరలింపు వద్దు



పోస్టర్లను విడుదల చేసిన నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జోనల్ బ్రాంచ్‌ను రాయలసీమ నుంచి తరలించవద్దని రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు తెలిపారు. చిత్తూరులో శనివారం జిల్లా నాయకులు గంగరాజు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కడప నుంచి జోనల్ బ్రాంచ్‌ను అమరావతికి తరలించాలనే నిర్ణయం మానుకోవాలన్నారు. విభజన చట్టంలో హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. ఇక్కడ ఉన్న కార్యాలయాలను అమరావతికి తరలిస్తే రాయలసీమను పట్టించుకునే పరిస్థితి ఉండదన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేతులెత్తేశారన్నారు. కనీసం కార్యాలయాలు ఉన్న వాటిని తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కడపలో బ్యాంకు ఉండేలా చర్యలు తీసుకోకపోతే సీమలోని అన్ని జిల్లాల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సురేంద్ర, బాల సుబ్రహ్మణ్యం, మణి పాల్గొన్నారు.

చెదిరిన గూడు



విజయపురం మండలం బూచివానత్తంలోని జగనన్న కాలనీ

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీల పేరుతో ఊళ్లను నిర్మించే మహా యజ్ఞం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి పేదోడికి కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులయితే చాలు ఇళ్లు మంజూరు చేసేశారు. ఇంతలోనే అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చింది. ఇంకేముంది పేదోడు గజగజ వణికిపోయేలా కూటమి సర్కారు అనర్హుల పేరుతో లబ్ధిదారుల ఆశల సౌధంపై కత్తి పట్టి కోతలు కోసేందుకు రంగంలోకి దిగింది. లబ్ధిదారుడిపై వాహనం ఉంటే ఇల్లు రద్దు..నిర్మించకుంటే ఇల్లు రద్దు.. ఇలా ఆంక్షల పేరుతో పేదోడి జీవిత కలను చిదిమేస్తోంది.

- జగనన్న కాలనీలో అనర్హుల ఏరివేత పేరుతో విచారణ
- జిల్లాలో సుమారు 77,366 పక్కాగృహాలు మంజూరు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్ల రద్దుకు కుట్ర
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కార్వేటినగరం : పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గూడులేని ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించేందుకు గత వైఎస్ జగన్ సర్కార్ సంకల్పించింది.అర్హులైన వారందరికీ పట్టాలు మొదలుకొని ఇళ్ల నిర్మాణం వరకు పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగింది. ఒక వైపు సంక్షేమ ఫలాలను అందిస్తూ మరోవైపు పేదల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు ఇచ్చిన స్థలాలతో పాటు పక్కా గృహాలకు సంబంధించి ప్రత్యేకంగా పరిశీలనకు ప్రస్తుత ప్రభుత్వం రంగంలోకి దిగింది. అనర్హుల పేరుతో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం పట్టాలను రద్దు చేయడానికి సమాయత్తం అయింది.

ఇళ్లు నిర్మించుకోకపోతే పట్టా రద్దు

జిల్లాలోని కాలనీ స్థలాలకు సంబంధించి పట్టాలు తీసుకుని ఇంటి నిర్మాణం ప్రారంభించని వారి పట్టాలను రద్దు చేసే దిశగా అధికార యంత్రాంగం చర్యలకు సన్నద్ధం అవుతోంది. అందుకు సంబంధించి ఈనెల 10 తేదీ నుంచి ప్రత్యేక బృందాలతో కూడిన టీంలు నిశిత పరిశీలనకు దిగాయి. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇల్లు నిర్మించుకోలేకపోయిన పేదల పట్టాలను కనికరం లేకుండా రద్దు చేయనున్నారు. ఇప్పటికే ఇంటి పట్టాల రద్దు వ్యవహారంపై కూటమి సర్కారు గతంలోనే స్పష్టత ఇచ్చింది. జిల్లాలో ఇంటి పట్టాలు తీసుకుని కారణాలు ఏవైనా ఇప్పటి వరకు నిర్మాణాలు మొదలు పెట్టని వారి పట్టాలతో పాటు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న వాటిని రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా చాలా మంది పేదలకు సంబంధించిన స్థలాలకు అధికార ప్రభుత్వం ఎసరు పెట్టేలా కనిపిస్తోందని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం

చిత్తూరు జిల్లా ఏడు నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 609 జగనన్న హౌసింగ్ లే అవుట్లు, 77,366 పక్కాగృహాలు మంజూరు చేశారు. పట్టణ ప్రాంతాల్లో అయితే సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో 1.50 సెంట్ల చొప్పున అప్పటి ప్రభుత్వం పేదలకు కేటాయించింది. ఎక్కడికక్కడ కేటాయించిన స్థలాలకు సంబంధించి ఒత్తిడి తీసుకొచ్చి ఇళ్లు నిర్మించుకునేలా కృషి చేశారు. ఇందులో ఇంటి నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.1000.687 కోట్లు ఖర్చు చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న సర్కారు ఎలాగోలా వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను, నాయకులను ఇబ్బంది పెట్టే దిశగా పావులు కదుపుతున్నారు. ఎక్కడికక్కడ ఇల్లు కట్టుకోలేని పేదలతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు స్థలాలు పొందినట్లయితే వాటిని రద్దు చేయించేలా స్థానిక కూటమి నేతలు కూడా అధికారులకు పలు సూచనలు చేసి ఇళ్లు రద్దు చేసేలా పరిస్థితులు తీసుకొస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

కాలనీల పరిశీలనకు బృందాలు జిల్లాలోని జగనన్న లే-అవుట్లతో పాటు ఇతర కాలనీల్లో స్థలాల పరిశీలనకు కదులుతున్నారు. ప్రధానంగా సర్వేయర్‌తో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌ఓలతో కూడిన బృందాలు స్థానికంగా ఉన్న కాలనీలోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకుంటున్నారా? లేదా ? నిర్మించుకున్నవారే ఉంటున్నారా? లేక ఇతరులకు ఇచ్చారా? పట్టాలు తీసుకున్న వారికి సంబంధించి గతంలో ఏవైనా గృహాలు ఉన్నాయా? సొంత వాహనాలు ఉన్నవారు తీసుకున్నారా? ఇల్లు నిర్మించుకోకపోవడానికి కారణాలు, బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోవడానికి కారణాలు ఇలా పలు అంశాలపై ఆరా తీస్తూ విచారణ చేపట్టనున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనతో పాటు విచారణ కార్యక్రమం దాదాపు 15 రోజుల పాటు కొనసాగనున్నట్లు అధికారుల తెలిపారు. ఏదిఏమైనా పేద ప్రజలకు సంబంధించిన పట్టాలు, ఇళ్ల విషయంలో ప్రభుత్వం అనర్హత పేరుతో ఏరివేతకు రంగం సిద్ధం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో జగనన్న హౌసింగ్ లే అవుట్‌లు	609
గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు	77,366
పూర్తయిన ఇళ్లు	46,163
పెండింగ్‌లో ఉన్నవి	31,203
బేస్‌మెంట్ దశలో ఉన్నవి	4,330
కేటాయించిన నిధులు (రూ. కోట్లు)	1000.687
కూటమి ప్రభుత్వంలో పూర్తయిన ఇళ్లు	2,389



వడమాలపేట మండలం కాయంపేట వద్ద జగనన్న కాలనీ

ఇబ్బందులు పడుతున్నాం



ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు లేక ఒకే ఇంటిలో ఇబ్బందులు పడుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చాక మాకు ఇంటి స్థలంతో పాటు, ఇంటి నిర్మాణం చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. రోజు వారి కూలీ జీవనం గడుపుతున్నాం. ఇంటి నిర్మాణం గోడల దశలో నిలిచిపోయింది. ఇప్పుడు అధికారానికి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్వే పేరుతో మార్చి లోపు ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇంటి పట్టాను రద్దు చేస్తామంటున్నారు. చేతిలో డబ్బులు లేవు.

– రేఖ, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం మండలం

కక్ష సాధింపు చర్యలు



గత ప్రభుత్వంలో ఉచితంగా ఇంటి స్థలం మంజూరు అయింది. ఇంటి నిర్మాణం చేసేందుకు ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై కక్ష సాధింపుతో సర్వే పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. మార్చి ఆఖరు లోపు ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇంటి పట్టా రద్దు చేస్తామంటున్నారు.

– శోభ, గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం మండలం

మార్చిలోపు ఇళ్లు పూర్తి చేసుకోవాలి

గత ప్రభుత్వంలో మంజూరైన పక్కాగృహాలను మార్చి ఆఖరిలోపు పూర్తి చేసుకోవాలని ఆదేశాల అందాయి. ఈ విషయంపై సిబ్బందితో పాటు జగనన్న కాలనీ, లే అవుట్లలో పక్కా గృహాలు ఏ దశలో ఉన్నాయో సర్వే చేస్తున్నాం. పునాదులు, లెంటల్ లెవల్‌లో నిలిచిపోయిన వారికి మార్చి ఆఖరి లోపు పూర్తి చేసుకోవాలని అవకాశం కల్పిస్తున్నాం.

– రాఘవయ్య, హౌసింగ్ డీఈ, జీడీ నెల్లూరు సబ్ డివిజన్

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



భారతి, సీనియర్ సివిల్ జడ్జి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్చి 8న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి పేర్కొన్నారు. శనివారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని జిల్లా న్యాయసేవా సదన్ భవనంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాలతో వచ్చేనెల నిర్వహించనున్న జాతీయ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, మోటారు యాక్టు, చెక్ బౌన్స్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ లాంటి అన్ని కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునే కేసులను అప్పీళ్లు కూడా ఉండదన్నారు. కేసుల పరిష్కారానికి సమీపంలోని పోలీస్ స్టేషన్, చిత్తూరు కోర్టులోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బర్డ్ ఫ్లూపై అపోహలు వీడండి



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్

పెనుమూరు(కార్వేటినగరం) : బర్డ్ ఫ్లూపై అపోహలు వీడాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం రేడియో రైతు దినోత్సవ సదస్సును పురస్కరించుకుని పులిగుంటీశ్వరస్వామి ఎఫ్‌పీసీ మ్యాంగో భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోళ్లకు సోకే బర్డ్ ఫ్లూ మనుషులకు సంక్రమించే అవకాశం లేదన్నారు. అలాగే పాడి రైతులు పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సావిత్రి మాట్లాడుతూ.. రైతులు సాంకేతికతను ఉపయోగించి డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల సమయంతో పాటు, అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు తప్పనిసరి అని గుర్తు చేశారు. అలాగే పట్టు పరిశ్రమ శాఖ జిల్లా సంచాలకులు మోహన్ బాబు మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమ మల్బరీ సాగు, షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీపై రుణాలు అందిస్తోందన్నారు. ఉద్యానశాఖ అధికారి సాగరిక మాట్లాడుతూ.. కూరగాయలు, పండ్లు, పూల సాగులో లభించే రాయితీలతో పాటు,షెడ్ల నిర్మాణం, పవర్ టిల్లర్, ఇతర యంత్రాలకు లభించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆకాశవాణి తిరుపతి కేంద్రం అధికారి నాగేశ్వరరావు, సాయి, రఘునాధచరణ్, నాగమునెయ్య, శ్రీనివాసులు, రాజేష్, మురళీమోహన్, కేంద్ర సహాయ సంచాలకులు ఎం.సుధాకర్ మోహన్ పాల్గొన్నారు.

30 కళాశాలలకు.. ఒకే ఒక్కడు



ఫిజికల్ డైరెక్టర్ లేని ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యాలు వెలికితీసి వారిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఆ దిశగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతులు, శిక్షకులను నియమించడంలో కూటమి సర్కారు విఫలం అవుతోంది. ఫలితంగా విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉన్నా శిక్షకులు లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఫలితంగా పోటీలు జరిగినప్పుడు పతకాలపై ఆశలు పెట్టుకుంటున్నారే తప్ప ముందస్తుగా నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయడంలో ప్రభుత్వానికి ముందు చూపు కొరవడడంతో గ్రామీణ క్రీడా ఆణిముత్యాలు మరుగున పడుతున్నాయి.

- జూనియర్ కళాశాలల్లో పీడీలు లేని వైనం
- క్రీడలకు దూరంగా కాలేజీలు
- ప్రభుత్వ కళాశాలల్లో క్రీడాకారులే కరువు
- పట్టించుకోని కూటమి సర్కారు
- నష్టపోతున్న పేద విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థి దశను మలుపు తిప్పే జూనియర్ కళాశాలల్లో క్రీడా ప్రమాణాలు అడుగంటిపోతున్నాయి. క్రీడలను చదువులో అంతర్భాగం చేసుకోవడమే కాకుండా పాఠ్యాంశాల్లో సైతం చేర్చాలని క్రీడా పండితులు యోచిస్తున్నారు. అయితే అమలులో మాత్రం ఏ మాత్రం నిర్లక్ష్యం వెంటాడుతోంది. కూటమి సర్కారు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడలపై అలసత్వం ప్రదర్శించడంతో విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు.

క్రీడల వైపు చూడని విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యలో 10వ తరగతి వరకు పీఈటీలు, పీడీలు విద్యార్థులకు క్రీడల పట్ల మంచి శిక్షణ ఇస్తున్నారు. వారిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. అయితే వారి కృషి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతోంది. అందుకు ప్రధాన కారణం ఇంటర్మీడియట్‌లో చేరేసరికి విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వకపోవడమే. దీంతో ఇంటర్‌లో చేరిన విద్యార్థులు అసలు క్రీడల వైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో ఇంటర్మీడియట్ కళాశాలల్లో పీడీలున్న సమయంలో క్రీడలు మెరుగ్గా నిర్వహించేవారు. అప్పట్లో శిక్షణ పొందిన ఎంతో మంది విద్యార్థులు క్రీడా కోటాలో రిజర్వేషన్ పొంది ఇంజినీర్లు, డాక్టర్లు, ఉద్యోగులుగా స్థిరపడ్డారు. ఉద్యోగ, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ పొందే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధిపై ఆలోచించడం లేదు.



ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం

ఉన్న ఒక్కరూ పదవీ విరమణకు దగ్గరిలో..

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా 33 మండలాలున్నాయి. ఈ మండలాల్లో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు 31 ఉన్నాయి. ఇన్ని కళాశాలు జిల్లాలో ఉంటే ఫిజికల్ డైరెక్టర్‌లు మాత్రం ఒక్కరే ఉన్నారు. అది కూడా జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీగా పనిచేస్తున్న షాజాహన్ మాత్రమే. ఆయన వచ్చే జూన్‌లో ఉద్యోగ విరమణ కానున్నారు. ఆ తర్వాత జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒక్క ఫిజికల్ డైరెక్టర్ ఉండని పరిస్థితి ఏర్పడనుంది. గతంలో జిల్లాలో ఏ పోటీలు నిర్వహించినా ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి క్రీడాకారులు వందల సంఖ్యలో హాజరయ్యేవారు. ప్రస్తుతం క్రీడల్లో పాల్గొనే జూనియర్ కళాశాలల క్రీడాకారులే కరువయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌ల నియామక ప్రక్రియ ఆగిపోవడంతో పీడీలు లేని పరిస్థితి ఏర్పడింది.

ఆగిపోయిన పదోన్నతులు

పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలు, ఎంపీఈడీ కోర్సు పూర్తి చేసినట్లయితే పీడీలుగా ఉద్యోగోన్నతులు పొందేవారు. జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపాలిటీ పాఠశాలల్లో పనిచేసే పీఈటీలు ఉద్యోగోన్నతులపై జూనియర్ కళాశాలలకు వెళ్లేవారు. అయితే దీనిపై కోర్టులో కేసు జరుగుతున్నందున ఉద్యోగోన్నతులు రెండు దశాబ్దాల నుంచి ఆగిపోయాయి. పీఈటీలంతా పాఠశాలల్లోనే ఉద్యోగ విరమణ పొందుతున్నారు. కొంత మంది హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందుతున్నారు. ఆటలు నేర్పించాల్సిన పీఈటీల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త వారిని నియమించడంలో విఫలమవుతోంది.

జిల్లా సమాచారం	
జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలు	02
మొత్తం జూనియర్ కళాశాలలు	33
ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు	13,589
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	12,311
మొత్తం విద్యార్థులు	25,900
పీడీలు లేని కళాశాలలు	30


ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం



జిల్లాలో 33 ప్రభుత్వ జూనియర్ కళాశాలున్నాయి. ఈ కళాశాలలో పీసీఆర్ జూనియర్ కళాశాలలో మాత్రమే పీడీ ఉన్నారు. పీడీ నియామకాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం.

– సయ్యద్ మౌలా, జిల్లా ఇంటర్మీడియట్ డీవీఈవో. చిత్తూరు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి



ప్రభుత్వం ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్‌ల నియామకాలను చేపట్టాలి. జూనియర్ కళాశాలల్లో పీడీలు లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. నియామకాలు జరిగితే పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసినట్లు అవుతుంది.

– రవీంద్రారెడ్డి, పీడీ, సిద్ధంపల్లి జెడ్పీ హైస్కూల్, చిత్తూరు జిల్లా

గర్భిణుల నమోదులో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్(కాణిపాకం): గర్భిణుల నమోదులో నిర్లక్ష్యం వద్దన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో శనివారం ఆమె వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణుల స్కానింగ్ రిపోర్ట్ వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. తద్వారా మాతాశిశుమరణాల కట్టడికి చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హనుమంతరావు, జయరాముడు, ఇంద్రాణి పాల్గొన్నారు.

వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్



వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్



జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోషియేషన్ అధ్యక్షులుగా రాజశేఖర్ (వీఆర్వో, తవణంపల్లి) నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవనంలో ఆ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ సంఘం పూర్వపు జిల్లా అధ్యక్షులు బాలాజీరెడ్డి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందడంతో నూతన జిల్లా అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శరత్‌కుమార్ (వీఆర్వో, చిత్తూరు రూరల్), కోశాధికారిగా దామోదరం (వీఆర్వో, తవణంపల్లి), ఉపాధ్యక్షులుగా వెంకటముని, జాయింట్ సెక్రటరీగా ఉమామహేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా తానీషా, సుబ్బయ్య, దేవకుమార్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు హనుమంతరావు, చిత్తూరు డివిజన్ మాజీ అధ్యక్షులు మార్కొండయ్య, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు కరుణాకర్, తిరుపతి డివిజన్ అధ్యక్షులు చెంగల్‌రాయలు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం టీడీపీ నేత సాంబశివన్ ఇంటి వద్ద అనుమతి లేకుండా 15 లోడ్‌ల ఇసుక నిల్వలను గమనించిన ఎస్ఐ చిన్నరెడ్డప్ప శనివారం వీఆర్‌ఓ తంగరాజ్‌తో కలిసి ఇసుక నిల్వలను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. సాంబశివన్ ఇంటి వద్ద అనుమతి లేకుండా 15 లోడ్‌ల ఇసుక డంపు ఉండడంతో సీజ్ చేసి తహసీల్దార్ అరుణకుమారికి అప్పగించారు. మండలంలో కొందరు ఉచిత ఇసుకను తీసుకొచ్చి డంప్ చేసి రాత్రి సమయంలో తమిళనాడుకు తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

అయ్యోర్లకు అటెండెన్స్ కష్టాలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో విద్యావ్యవస్థ అధోగతి పాలవుతోందని టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్తగా క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటైన తర్వాత సమావేశాల నిర్వహణకు సర్కారు షెడ్యూలు విడుదల చేసింది. ప్రతినెలా మూడో శనివారం ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఒకవేళ ఆరోజు సెలవు దినమైతే నాల్గో శనివారం నిర్వహించేవారు. ఈ మేరకు శనివారం జిల్లా వ్యాపంగా నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలల్లో టీచర్లను అటెండెన్స్ వేయకుండా ఇబ్బందులకు గురిచేశారు. సాయంత్రం 5.30 గంటల వరకు అటెండెన్స్ వేసేందుకు అవకాశం కల్పించకపోవడంతో జిల్లాలో సమావేశాలకు హాజరైన టీచర్లు అవస్థలు ఎదుర్కున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్



మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుడుపల్లె: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కనమనపల్లె గ్రామానికి చెందిన సూర్యప్రకాష్, రాజశేఖర్, సత్యవేలు కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని బిసానత్తం ప్రాంతంలోని వైన్స్ షాపు నుంచి ద్విచక్ర వాహనాలలో ఉదయాన్నే మద్యాన్ని తీసుకుని వెళ్లుతున్నారు. సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కాపు కాసి బిసానత్తం నుంచి వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. తనిఖీలలో ఆ రెండు వాహనాలలో రూ.27 వేల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు.

మద్యం మత్తులో భార్య హత్య

శాంతిపురం: మద్యం మత్తులో భర్త తన భార్యను కడతేర్చిన ఘటన మండలంలోని కడపల్లి పంచాయతీ, మాదనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మునస్వామి మద్యానికి బానిసగా మారి తన సంపాదన మొత్తం తాగుడుకు ఖర్చుపెట్టేవాడు. అది సరిపోక డబ్బు కోసం భార్యను వేధించేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మత్తులో ఉన్న మునస్వామి డబ్బు కోసం తన భార్య మంగమ్మ(40)తో గొడవ పెట్టుకున్నాడు. భార్య డబ్బులు ఇవ్వలేదని తనపై ఇనుప రాడ్డుతో దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. దీనిపై తమిళనాడులోని నాట్రంపల్లికి చెందిన మృతురాలి తమ్ముడు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతేదహాన్ని బంధువులకు అప్పగించారు.

అక్కడ చోరీ.. ఇక్కడ తాకట్టు!

- పొరుగు రాష్ట్రాల్లో బైక్ చోరీలు.. ఆంధ్రాలో తాకట్టు
- పలమనేరు సబ్ డివిజన్‌లో భారీగా చోరీ వాహనాలు
- తక్కువ ధరతో స్థానికులకు తాకట్టు పెడుతున్న వైనం
- చోరీ బైక్‌లపై జల్లెడ పడుతున్న కర్ణాటక పోలీసులు

బైక్ దొంగలను అరెస్ట్ చేసిన బెంగళూరు పోలీసులు (ఫైల్)



పలమనేరు : దురాశ దుఃఖానికి చేటని తెలిసినా కొందరు తప్పు చేసి ఎవరికీ చెప్పుకోలేక బాధపడుతున్నారు. ఇటీవల కాలంలో పొరుగు రాష్ట్రాల్లో బైక్ చోరీలు ఎక్కువయ్యాయి. వీటిని చోరీ చేసిన వారు ఇక్కడి వారికి తక్కువ ధరకు తాకట్టు పెడుతున్నారు. నెలలో బైక్ విడిపించుకుంటామని అంత వరకు బైక్ మీవద్దే పెట్టుకొని డబ్బులు ఇవ్వాలని ముందే లాగేసుకుంటున్నారు. దీనికి వడ్డీ సైతం నూటికి 5 రూపాయలుగా ఉండడంతో స్థానికులు ఆశపడి వీటిని తాకట్టుకు పెట్టుకుంటున్నారు. కొన్నాళ్లకు ఈ దొంగ బండ్లను పోలీసులు రికవరీ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో వీరు తాకట్టు కోసం ఇచ్చిన డబ్బులు, తాకట్టు పెట్టిన బైక్ పొగొట్టుకుని ఏం చేయలేక, ఎవరికీ చెప్పుకోలేక లోలోన కుమిలిపోతున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటకలోని బెంగళూరు కళాసిపాళెం, హోస్కోట, మాలూరు, కోలారు, ముళబాగిళు తదితర పీఎస్‌ల పరిధిలో ఈ మధ్య ఎక్కువగా పల్సర్, బుల్లెట్, యాక్టివా యాక్సిస్ బైక్‌లను టార్గెట్ చేసి దొంగలు చోరీలు చేశారు. ఈ చోరీలపై సంబంధిత స్టేషన్లలో పలు కేసులు నమోదు అయ్యాయి.

రంగంలోకి దిగిన కర్ణాటక పోలీసులు

కర్ణాటక పోలీసులు వారం రోజులుగా ఇక్కడి పోలీసుల సాయంతో చోరీ బైక్ ల అన్వేషణ మొదలు పెట్టారు. ఈ క్రమంలో గంగవరం, పలమనేరు , బంగారుపాళెం, వీకోట, బైరెడ్డిపల్లి మండలాల్లో ఎక్కువగా వాహనాలను రికవరీ చేసినట్లు సమాచారం. ఇంకా పలు దొంగ బండ్ల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన దొంగలు సైతం జల్సాలకు అలవాటు పడిన యువకులేనని తెలుస్తోంది.

ఆన్‌లైన్‌లో ఆర్‌సీలు పొందుతున్న వైనం

చాలా వరకు ఇలాంటి చోరీ వాహనాలు అమ్మడం కష్టమని దొంగలకు తెలుసు. దీంతో వీరు లక్ష విలువజేసే బైక్‌ను రూ.20 వేలకే కొందరికి అంటగడుతున్నారు. అధిక వడ్డీ కోసం ఆశ పడిన కొందరు వీటికి రికార్డులున్నాయా అని కూడా చూడకుండా బైక్ మన వద్ద ఉందిలేననే ధైర్యంతో తాకట్టు పెట్టుకుంటున్నారు. ఈ దొంగల్లో కొందరు తెలివైన వారు ఆర్‌టీఏ వెబ్‌సైట్‌లో బండి ఆర్‌సీలను సైతం డౌన్‌లోడ్ చేసి ఆ జిరాక్స్‌లను చూపి ప్రైవేటు ఆటో ఫైనాన్స్ వారికి కుదవలకు పెట్టేస్తున్నారు. ఏదేమైనా దురాశకు వెళ్లి ఇలా చోరీ వాహనాలను కుదవకు పెట్టుకున్న వారి గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్ : రోడ్డు భద్రతా నియమాలను పాటించి, విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం మురకంబట్టులోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వినియోగించాలన్నారు. ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఏటా రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అనంతరం రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గురజాలజగన్‌మోహన్, మురళిమోహన్, డీటీసీ నిరంజన్‌రెడ్డి, చుడా ఛైర్మన్ కఠారి హేమలత పాల్గొన్నారు.

సదుం ఎంపీటీసీ సభ్యుడి మృతి

సదుం : మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఆనంద (54) అస్వస్థతతో శనివారం మృతి చెందారు. అనారోగ్యంతో ఆయన కొద్ది రోజులుగా బెంగళూరు, తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



ఆనంద్ (ఫైల్)

సారా తయారీపై ఉక్కుపాదం

- 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

శ్రీరంగరాజపురం : సారా తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగరి డీఎస్పీ మహమ్మద్ సయ్యద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నతయ్యూరు, యు.ఎం.పురం గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో సుమారు 1500 లీటర్ల బెల్లం ఊట, 5 లీటర్ల సారాతో కొంత మంది అనుమానితులపై విచారించి కేసు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నగరి డీఎస్పీ మహమ్మద్ సయ్యద్ మాట్లాడుతూ.. అక్రమ మద్యం తయారీ, అమ్మకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సారా తయారీ చేసిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడమే కాకుండా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సారా తయారీలో అక్రమార్కులు వినియోగించే పదార్థాలతో మద్యానికి బానిసలైన వారు చిన్నవయస్సులోనే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, వాటివల్ల వారి కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందన్నారు. సారా తయారీకి స్వస్తి చెప్పి ప్రజా జీవనం గడపాలని యువతకు సూచించారు. పలుమార్లు కేసు నమోదు అయితే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. దాడుల్లో కార్వేటినగరం సీఐ హనమంతప్ప, ఎస్ఐలు సుమన్ (శ్రీరంగరాజపురం), రాజ్‌కుమార్ (కార్వేటినగరం) దాదాపు 30 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నగరి డీఎస్పీ మహమ్మద్ సయ్యద్

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 20వ తేదీ (గురువారం) నుంచి 30 రోజుల పాటు మహిళలు, పురుషులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289 సంప్రదించాలని పేర్కొన్నారు.

కరెంటు స్తంభాన్ని ఢీకొని వాహనం బోల్తా

- ముగ్గురికి తీవ్ర, ఏడుగురికి స్వల్ప గాయాలు

గంగాధరనెల్లూరు : కరెంటు స్తంభాన్ని ఢీకొని టాటా ఏస్ బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని ముక్కలతూరు వద్ద చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. గంగాధర మండలం వేల్కూరులోని ఇందిరానగర్‌లో శనివారం ఒక వ్యక్తి మృతి చెందడంతో అదే మండలానికి చెందిన ఆత్మకూరు గ్రామానికి చెందిన వారు అంత్యక్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ముక్కలత్తూరు పంచాయతీ నాసనపల్లి సమీపంలో కాసా బిల్డింగ్ వద్ద టాటా ఏస్ వాహనం అదుపు తప్పి రోడ్డు సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇంద్రాణి, మేరి, దేవరాజులను మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు, స్వల్పగాయాలైన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని దెబ్బతిన్న టాటా ఏస్



చికిత్స పొందుతున్న బాధితుడు

పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభం

- 250 మందికి ఉపాధి
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ కండెవాల్

పుంగనూరు : శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీలో ఉత్పత్తులు ప్రారంభించడం సంతోషంగా ఉందని, అందరి సహకారంతో పరిశ్రమను మరింత విస్తరించి అన్ని రకాల ఉత్పత్తులను తయారు చేస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ కండెవాల్ తెలిపారు. శనివారం నూతన కంపెనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సురేష్ కండెవాల్‌తో పాటు సీనియర్ జీఎం దొరైరాజు, ప్లాంట్ ఇన్‌చార్జి సేనాపతి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కండెవాల్ మాట్లాడుతూ.. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని పుంగనూరు మండలం, ఆరడిగుంటలో పరిశ్రమను ఏర్పాటు చేయడం అదృష్టమన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం సహకారం అందించిన మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తూ, ఫ్యాక్టరీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తమ కంపెనీ భారతదేశంలో అయిదు ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించి, డీఐ పైపుల పంపిణీలో భారతదేశంలో తొలి స్థానంలో నిలిపామన్నారు. శ్రీకాళహస్తి ఫ్యాక్టరీలో సుమారు 6 వేల మంది కార్మికులతో ఉత్పత్తులు ఎగుమతులు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో ఉత్పత్తుల నైపుణ్యంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, విద్యారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కండెవాల్ తెలిపారు.

కూలి పనికెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- చింతచెట్టు నుంచి పడి వ్యక్తి మృతి

చౌడేపల్లె : కూలి పనుల కోసం చింతకాయలు కోసేందుకు వెళ్లిన గంగాధర్ (32) తిరిగిరానిలోకాలకు వెళ్లిన ఘటన శనివారం సింగిరివారిపల్లె సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. బండమీదపల్లెకు చెందిన గంగాధర్ అతని భార్య శిరీషతో పాటు ఆ గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి దిగువపల్లె పంచాయతీ సింగిరివారిపల్లె వద్దకు చింతకాయలు కోసేందుకు ఆటోలో కూలీకి వెళ్లారు. చెట్టు ఎక్కి చింతకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు గంగాధర్ చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. గమనించిన భార్య శిరీష, సహచర కూలీలు చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంగాధర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గంగాధర్ మృతదేహం

అల్లం లోడ్ లారీ కాలువలో బోల్తా

తవణంపల్లె : మండలంలోని జొన్నగురకల సమీపంలోని హంద్రీనీవా కాలువలో అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తవణంపల్లె పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ.. చింతామణి నుంచి లారీలో అల్లం (సుమారు 15 టన్నులు) లోడ్‌తో ఒడిశాకు బయలుదేరిందని వివరించారు. రోడ్డు మార్గం తప్పిన వాహనం బంగారుపాళ్యం నుంచి అరగొండ మీదుగా వచ్చి జొన్నగురుకల సమీపంలో అదుపు తప్పి హంద్రీనీవా కాలువలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ ఎలాంటి గాయాలు లేకుండా ప్రమాదం నుంచి బయట పడ్డారు.



జొన్నగురకల సమీపంలో బోల్తాపడిన లారీ

గంజాయి తరలిస్తున్న దంపతుల అరెస్ట్

- 1,200 గ్రాముల గంజాయి స్వాధీనం

నగరి : గంజాయి తరలిస్తున్న దంపతులను శనివారం సీఐ మహేశ్వర్ అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గంజాయి తరలింపుపై వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆదేశాల మేరకు డెప్యూటీ తహసీల్దార్ ధనుంజయలుతో పాటు ఓజీ కుప్పం గ్రామ మార్గంలో కాపుకాసి గంజాయి తరలిస్తున్న దంపతులు జీ.నరసింహులు (56), పుష్పవతి (48)ని అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25 వేల విలువ చేసే 1,200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు.



దంపతులను అరెస్టుచూపుతున్న పోలీసులు